

ఆయన ఒక సజీవ గ్రంథాలయం.

నడయాడే విజ్ఞాన సర్వస్వం

# మా మాష్టారు రోశయ్యగారు

## డాక్టర్ అమరేంద్ర

''మాన్యుమా యలవర్తి రోసయ'' అనే పాదం ''మొయిలు రాయబారం'' అనే కావ్యంలో మొదటిసారి నాకు రోశయ్యగారితో పరిచయం కలిగించింది. ఆ కావ్యం మాకు బి.ఏ. తరగతిలో పాఠ్యగ్రంథం, అది కాళిదాసు మేఘసందేశ కావ్యానికి త్రిపురాన దొరగారు చేసిన అనువాదం. ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో మాకు ఆ కావ్యం పాఠం చెప్పిన కొమాండూరి కృష్ణమాచార్యులు గారు రోసయ్యగారిని బాగా ప్రశంసించి ''ఆయన మన కాలేజిలోనే ఇంగ్లీషు డిపార్టుమెంటులో పని చేస్తున్నారు తెలుసా?'' అన్నారు. వెదుక్కుంటూ వెళ్ళాను మర్నాడు.

అప్పుడు మాస్టారు తరుణప్రాయంలో వుండేవారు. అందమైన నొక్కుల క్రాపు, ముచ్చటగొలిపే రూపం. ఒక్కసారి మాట్లాడితే చాలు ఆప్యాయంగా దగ్గరకు తీసుకునే శిష్యవాత్సల్యం. సాహిత్యాధ్యయనం పట్ల గాఢమైన అభినివేశం కలిగించే సంభాషణాచాతుర్యం. ఒక ఆయస్కాంత శిలలాగావిద్యార్థులను తనచుట్టూ గుమికూడేట్లు చేసుకోగల ఆకర్షణశక్తి ఇతరుల క్లాసుల్లో వచ్చిన తలనొప్పికి రోసయ్యగారి లెక్చరు అమృతాంజనం. పాఠ్యభాగానికి పరిమితం

కాకుండా ఎన్నెన్నో రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, సాహిత్య ప్రస్తావనలతో ఆంగికవాచక విన్యాసాలతో కొనసాగే ఆయన బోధన ఎందరిలోనో సారస్వత పిపాసనూ జిజ్ఞాసనూ ఉద్దీపనం చేసింది. ఆయన టీచర్ ఆఫ్ టీచర్స్!

ఆంగ్ల ఆంధ్ర భాషా సారస్వతాలలో ఆయన పాండితీ వైభవానికి రోసయ్య సేకరించిన అపూర్వ గ్రంథాలే సాక్ష్యమిస్తాయి. వ్యాకరణ శాస్త్రమన్నా, శాస్త్రీయ సంగీతమన్నా అపారమైన మమకారం. క్లాసికల్ కవిత్వం మీద, కళల మీద వల్ల మాలిన అభిమానం. జీవితాన్ని ఒక మహాకావ్యంగా మలచుకున్న మిల్టన్ కవిశేఖరుని పేరు చెబితే వీరావేశం. నేలబారు ఆలోచనలన్నా చౌకబారు అభిరుచులన్నా తీవ్రమైన నిరసనం. ఉన్నతాశయాలకోసం పరిస్థితులతో రాజీపడకుండా నిత్యమూ పెనగులాడే ఆదర్శవాదం. తాను నమ్మిన విశ్వాసం కోసం కాలప్రవాహానికి ఎదురీదగల గుండెనిబ్బరం. ఇవన్నీ నాకు రోసయ్యగారిలో గోచరించే విశిష్ట లక్షణాలు-నాటికీ నేటికీ మారని మనిషి ఆయన.

అంతకు పూర్వం సాహిత్య విశారదులుగా పండిత వరేణ్యులుగా మన్ననలు పొందిన రోసయ్యగారు జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాల కులపతిగా పరిపాలనా దక్షతనూ నిర్వహణా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. విద్యాప్రమాణాల సాధనకూ, క్రమశిక్షణా వికాసానికీ పునాదులు వేశారు. చక్కటి రాజమార్గం నిర్మించారు. అమూల్యమైన గ్రంథ సంపదతో లైబ్రరీని సుసంపన్నంచేశారు. ఆయన తరువాత ఆకుర్చీలో కూచునే వారందరూ అనుదినమూ ఆయనను తలుచుకునే విధంగా కళాశాల బాలారిష్టాలన్నిటినీ దాటించి కుదురైన నడకను నేర్పించారు. ఆయన తీసిన దారి వెంబడే అడుగులు వేస్తున్నది కళాశాల, రెండువేల గుండెల వైజయంతిమాల. నిర్దుష్ట కర్తవ్యపాలనమే ధ్యేయంగా జీవించే ఉత్తమ కర్మయోగి ఆయన. అర్ధాంగి ప్రమాదస్థితిలో ఆసుపత్రిలో వున్నప్పుడుకూడా ఆయన కాలేజిలోనే వున్నారు, అంతటి ఉన్నత ప్రమాణం చేరుకోటం అందరికీ సాధ్యంకాదు. కళాశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దటం కోసం వ్యక్తిగత విషయాలెన్నిటినో

ఉపేక్షించి ఏకైక దీక్షతో కృషి చేసిన కర్తవ్య పరాయణులు మా మాస్టరుగారు. నిర్దిష్టమైన విధులను నిర్దుష్టంగా నిర్వహించటమే ఆయన పరమలక్ష్యం.

ఆయన ప్రిన్సిపాలుగా వున్నకాలంలో కళాశాలలో అధ్యాపకులుగా పనిచేసిన మా కందరికీ ఒక్క సత్యం నిత్యం అనుభవంలోకి వచ్చేది. పల్కు దారుణాఖండల శస్త్ర తుల్యం కావచ్చునుగాని నిండు మనంబు నవ్యనవనీత సమానం. ఈ లక్షణంలోనేకాదు శిష్టాచారపాలనలో కూడా ఆయన విప్రోత్తముడు. ఆయన మాటలతో నొప్పించినా చేతలతో ఎవరికీ అపకారం చేయని ఉపకారి.

సాంఘిక విషయాలలో సంస్కరణపట్ల అభిమానం, భాషావిషయంలో సంప్రదాయం పట్ల అంతటి గాఢమైన విశ్వాసం, భారత సంస్కృతి అంటే ఆదరం. హేతువాద విలసితమైన విశ్వజనీన దృక్పథం అంటే అభినివేశం. పరస్పర విరుద్ధాలుగా కనబడే ద్వంద్వాలకు చిత్తశుద్ధితో సమన్వయం కుదుర్చుకోగలిగిన విశిష్ట మేధా సంపద రోసయ్యాగారు. జీవిత సాగరాన్ని తీవ్రంగా మథించి సాధించిన అమృత కలశం.

ఆయన, అసాధారణమైన వ్యక్తి. విధి విలాసం చేత గుంటూరు మండలంలో ఆలస్యంగా ఆవిర్భవించిన పందొమ్మిదో శతాబ్దపు ఆంగ్లమేధావి ఆయన. లండను చూడకపోయినా ఆ నగరపు సందుగొందులన్నీ ఆయనకు తెలుసు. ఆంగ్లకవుల జీవితాల్లోని వివరాలూ విశేషాలూ వెలుగునీడలూ ఆయనకు తెలిసినంతగా మా కెవరికీ తెలియవు. ''నాతో మాట్లాడటమే ఒక ఎడ్యుకేషన్'' అని గిరీశం డాబులు కొట్టాడు. కాని రోసయ్య గారితో సంభాషించటమే ఎడ్యుకేషన్. విజ్ఞానమూ వినోదమూ సరియైన తూకంలో అందించే మధురానుభూతి. ఆయన ఒక సజీవ గ్రంథాలయం. నడయాడే విజ్ఞాన సర్వస్వం.

ఒక్కమాటలో చెప్పాలంటే సాహితికీ సంస్కృతికీ పూలశయ్య మా యలవర్తి రోసయ్య.